క్లుప్తంగా

కంటి వైద్య శిబిరం

మదనపల్లె : మండలంలోని అంకిశెట్టిపల్లెలో లయన్స్ కంటి ఆస్పత్రి, ఐటెల్ గ్రూపు ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన లభించింది. సర్పంచ్ వై.శరత్ రెడ్డి సహకారంతో గ్రామ సచివాలయంలో ఏర్పాటుచేసిన కంటి వైద్య శిబిరంలో అంకిశెట్టి పల్లెకు చెందిన వారే కాకుండా సమీప గ్రామాల నుంచి ప్రజలు హాజరై కంటిపరీక్షలు చేయించుకున్నారు. వైద్యశిబిరానికి హాజరైన వారికి డాక్టర్.నివేదిత, లయన్స్ కంటి హాస్పిటల్ టెక్నీషియన్లు పరీక్షించి మందులు ఉచితంగా అందజేశారు. కంటి ఆపరేషన్లకు ఎంపికైన వారికి ఆరోగ్యశ్రీపథకం, ఈహెచ్ఎస్ ద్వారా ఉచితంగా చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో అంకిశెట్టిపల్లె సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధులపై వేధింపులు మానాలి

మదనపల్లె సిటీ: వృద్ధులపై వేధింపులు మానాలని మహాత్మా సీనియర్ సిటిజెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్.మునిగోపాలకృష్ణ అన్నారు. గురువారం స్థానిక బెంగళూరు రోడ్డులోని జీఆర్టీ ఉన్నత పాఠశాలలో ప్రపంచ వృద్ధుల వేధింపుల నివారణ అవగాహన దినోత్సవం జరిగింది. ఆయన మాట్లాడుతూ మానవ, నైతిక విలువలు రోజు రోజుకు తగ్గిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి నాగరాజ, గౌరవ అధ్యక్షులు వై.ఎస్.మునిరత్నం, ఉపాధ్యక్షులు జగన్మోహన్, టీఎస్ఏ కృష్ణమూర్తి, ధనలక్ష్మి, ప్రొఫెసర్ చంద్రశేఖర్, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు.

సదుపాయాలు కల్పించాలి

మదనపల్లె : అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలను కల్పించాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్, మదనపల్లె అధ్యక్ష, కార్యదర్శులు మధురవాణి, రాజేశ్వరి కోరారు. గురువారం అంగన్వాడీ వర్కర్స్ స్థానిక సమస్యలపై ఐసీడీయస్ ప్రాజెక్ట్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంగన్వాడీలకు గ్రాట్యుటీ, కనీస వేతనం, పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏపీ అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ప్రభాకరరెడ్డి, అంగన్వాడీ వర్కర్స్ పాల్గొన్నారు.

విద్య పేరుతో వ్యాపారం

మదనపల్లె సిటీ: కార్పొరేట్ విద్యా సంస్థలు విద్య పేరుతో వ్యాపారం చేస్తున్నారని ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి మాధవ్ ఆరోపించారు. గురువారం ఏఐఎస్ఎఫ్ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ నారాయణ, చైతన్య పాఠశాలల్లో అడ్మిషన్లు, యూనిఫామ్, బుక్స్ పేరుతో అనేక రకాలుగా ఫీజులు వసూలు చేస్తున్నారని తెలిపారు. పాఠశాల వద్ద ఫీజుల బోర్డులు పెట్టాలని నిబంధనలు ఉన్నా దీన్ని పట్టించుకోలేదన్నారు. ఈ విషయంపై డీవైఈఓ చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు వినయ్, కమలాకర్, వెంకటేష్, ఓబులేసు, సురేష్, నరేంద్ర, రాజు తదితరులు పాల్గొన్నారు.

బీసీసేన జిల్లా యువజన కార్యదర్శిగా శ్రీనివాసులు

మదనపల్లె : బీసీసేన అన్నమయ్య జిల్లా యువజన కార్యదర్శిగా బందిపోటు శ్రీనివాసులు, ఉపాధ్యక్షులుగా నవోదయ మల్లికార్జునలను నియమిస్తూ బీసీ సేన రాష్ట్ర అధ్యక్షులు సొంటి నాగరాజ నియామక పత్రాలను అందించారు. తిరుపతి వెటర్నరీ కళాశాల అతిథిగృహంలో జరిగిన కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా బీసీ సేన కార్యవర్గాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా నూతన నియామకాలు పొందిన శ్రీనివాసులు, మల్లికార్జున మాట్లాడుతూ బీసీ సేన బలోపేతానికి కృషి చేస్తామన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

మదనపల్లె సిటీ: మదనపల్లె పట్టణం చిత్తూరు రోడ్డులోని కనుమలో గంగమ్మగుడి, దేవళంవీధిలోని సోమేశ్వరస్వామి ఆలయాల హుండీల ఆదాయం గురువారం లెక్కించారు. కనుమలో గంగమ్మగుడి ఆలయంలో మూడు నెలలకు రూ.1,80,059 , సోమేశ్వరస్వామి ఆలయంలో రూ.65,011 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ రమణ తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది అంకన్న తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

పీలేరురూరల్ : గర్భిణులకు ప్రభుత్వాస్పత్రుల్లోనే సురక్షిత ప్రసవం జరుగుతుందని రేగళ్ల పీహెచ్సీ వైద్యాధికారి డాక్టర్ కార్తీక్కుమార్ అన్నారు. గురువారం స్థానిక మత్తురాసివీధిలో అంగన్వాడీ కేంద్రంలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో హెచ్ఈ ఉషారాణి, ఐసీడీఎస్ సూపర్వైజర్ స్వరూప, రమాదేవి, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

చెంబకూరులో సర్వే

రామసముద్రం: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం చెంబకూరు పరిధిలోని చెంబకూరులో జాతీయ కుటుంబ ఆరోగ్య పారిశుద్ధ్య , తాగునీటి స్వచ్ఛతపై సిగ్మా పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది గురువారం సర్వే నిర్వహించారు. గ్రామంలో కుటుంబ నియంత్రణ, మాతా శిశు సంరక్షణలతో పాటు ఆరోగ్యాంశాల పట్ల సర్వే చేశారు. సర్వే నివేదికను ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పాపులేషన్ సంస్థకు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు ఎస్.నూరుల్లా, సునీతకుమారి, ఎంపీహెచ్ఈఎస్ శ్రీనివాసులు, జిల్లా సమన్వయకర్త గోవిందయ్య, సభ్యులు భరత్, సిద్దిరాజు, శశికాంత్ తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ముఖ్యమంత్రి లక్ష్యం

– పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

కలికిరి: రాష్ట్రంలో పేదల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలోని కలికిరి మండలం గుండ్లూరు గ్రామ పరిధిలోని ఈతమానువడ్డిపల్లి, జగిలివాండ్లపల్లి, కొర్నమిట్టపల్లిలలో ఎమ్మెల్యే చింతల ఇంటింటికి పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కులమత, రాజకీయాలకతీతంగా అర్హతే ప్రామాణికంగా ప్రతి కుటుంబానికి ప్రభుత్వం నేరుగా లబ్ధిచేకూరుస్తోందన్నారు. వైఎస్సార్సీపీ నాలుగేళ్ళ పాలనలో ప్రతి కుటుంబానికి రూ.లక్ష నుంచి గరిష్టంగా రూ.7 లక్షల వరకు లబ్ధి చేకూరుతోందన్నారు. గత ఎన్నికలలో ఇచ్చిన హామీలనే కాకుండా మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రికి దక్కుతుందన్నారు. వలంటీర్లు, గ్రామ సచివాలయ ఉద్యోగుల పనితీరుపై ప్రజలను విచారించారు. గ్రామాలలో తాగునీటి బోరు, పైపులైను, మురుగు నీటి కాలువలు, ఆరోగ్యశ్రీ వర్తింపు, సిమెంటు రోడ్లు, అంగవైకల్య పింఛన్లు, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు, రెవెన్యూ సమస్యలు తదితరాలపై ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల నుంచి వచ్చిన వినతులపై ఆయా శాఖల అధికారులు పరిష్కార చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే ఆదేశించారు.

గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు

పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో అమలులో ఉన్న నట్టల నివారణ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి గుండ్లూరు గ్రామం జగిలివాండ్లపల్లిలో ప్రారంభించారు. అలాగే పశుబీమా, 75శాతం రాయితీతో పశుగ్రాస విత్తనాలను పాడి రైతులకు అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పశుసంవర్ధక శాఖలో అమలులో ఉన్న ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి రైతుకు అందేలా సిబ్బంది చర్యలు చేపట్టాలన్నారు. పశుగ్రాస విత్తనాలు (జొన్న, మొక్కజొన్న, అలసంద, సజ్జ) మండల పరిధిలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని, అవసరమైన రైతులకు వీటిని అందచేయనున్నట్లు కలికిరి పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు వెంకట మునినాయుడు తెలిపారు.

– కార్యక్రమాలలో మార్క్ఫెడ్ మాజీ చైర్మన్ నల్లారి తిమ్మారెడ్డి, వైఎస్సార్సీపీ మండల కన్వీనర్ రమేష్ కుమార్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు రవీంద్రనాథ్రెడ్డి, తహశీల్దారు భాగ్యలత, ఎంపీడీఓ గంగయ్య, పశువైద్యాధికారి గిరినాథరెడ్డి, సర్పంచ్లు వెంకటరెడ్డి, తస్లీమారిజాయ్, గంగయ్య, మండల కో–ఆప్షన్ సభ్యుడు రిజ్వాన్, సచివాలయాల కన్వీనర్ రెడ్డెప్ప, ఎస్సీసెల్ ఎస్టీడి హరి, మధుసూదన్రెడ్డి, మహేంద్రరెడ్డి, స్థానిక నాయకులు రౌనక్బాషా, నాగరాజ, రామయ్య, చంద్ర, శ్రీకాంత్, సాజితుల్లా, రెడ్డిశేఖర్, బాలయ్య, హరి తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

డిపో లాభాల బాటలో పయనించాలి

మదనపల్లె సిటీ: ఆర్టీసీ డిపో లాభాల బాటలో పయనించేలా సమిష్టి కృషి చేయాలని ఆర్టీసీ టు డిపో మేనేజర్ ఆర్సీ నిరంజన్ తెలిపారు. గురువారం స్థానిక టు డిపో కార్యాలయంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ సమ్మర్ స్పెషల్ పేరుతో నడిపిన బస్సులకు మంచి ఆదరణ వచ్చిందన్నారు. డ్రైవర్, కండక్టర్ నుంచి సిబ్బంది కలిసి పని చేయడంతో ఆదాయం పెరిగిందన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులు ప్రోత్సాహకాలు అందిస్తామన్నారు. సూపరింటెండెంట్ ఎం.వి.రమణ, ఈపీకేలో కండక్టర్లు, డ్రైవర్లు కె.ఆర్.కృష్ణ, ముస్తఫా, టీ.ఎస్.రాజా, రెడ్డప్ప, టిఎం రత్నం, కెఎంపిఎల్లో ఆర్ఎల్ రెడ్డి, ఎం.వి.రమణ, మార్కెటింగ్ విభాగంలో జీవి.రమణ, రఘునాథ్, ఏ.కె.స్వామి, హుస్సేన్, ఎస్.కె.ఎం.బాషలకు బహుమతులు అందజేశా రు. కార్యక్రమంలో సైకాలజిస్టు సుధాకర్రెడ్డి, హెడ్కానిస్టేబుల్ రామమూర్తి పాల్గొన్నారు.

పీలేరు రూరల్ : ఇంధనం పొదుపు ఆదాయానికి మలుపులాంటిదని డీఎం బి. కుమార్ అన్నారు. గురువారం స్థానిక ఆర్టీసీ గ్యారేజ్లో ఇంధనం పొదుపుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మే నెలలో ఇంధనం పొదుపులో పీలేరు డిపో ద్వితీయ స్థానం సాధించిందని అన్నారు. అత్యధికంగా ఇంధనం పొదుపు చేసిన డ్రైవర్లు జి. యర్రయ్యకు ప్రథమ బహుమతి, బీఆర్సి. నాయక్కు ద్వితీయ బహుమతి అందజేశారు. ప్రతి డ్రైవర్ వీరిని ఆదర్శంగా తీసుకుని ఇంధనం పొదుపుతో ఆదాయం సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ ధనుంజయలు, గ్యారేజ్ ఎంఎఫ్ హరినాథరెడ్డి, ఎస్టీఐ సుధాకర్నాయక్ పాల్గొన్నారు.



మదనపల్లె: బహుమతి అందుకుంటున్న ఆర్టీసీ సిబ్బంది

సమగ్ర యాజమాన్య సస్యరక్షణతో అధిక దిగుబడి

నిమ్మనపల్లె : వివిధ పంటల సాగులో సమగ్ర పోషక యాజమాన్య సస్యరక్షణ పద్ధతులు అవలంబించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని కలికిరి కృషి విజ్ఞానకేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్.జీ.ఎస్.పాండురంగ అన్నారు. గురువారం మండలంలోని రెడ్డివారిపల్లె సచివాలయం వద్ద రైతులకు వివిధ పంటల సాగులో పాటించాల్సిన సమగ్ర యాజమాన్య పద్ధతులపై శిక్షణా కార్యక్రమాన్ని కృషి విజ్ఞానకేంద్రం ఆధ్వర్యంలో వ్యవసాయ అధికారి చంద్రశేఖర్ నిర్వహించారు. కార్యక్రమానికి మదనపల్లె వ్యవసాయశాఖ ఏడీఏ శివశంకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్.జీఎస్.పాండురంగ మాట్లాడుతూ ప్రస్తుత ఖరీఫ్సీజన్లో రైతులు వేరుశెనగ పంట సాగుకు సమాయత్తమవుతున్నారని, విత్తన దశ నుంచి సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించి మేలైన పంట దిగుబడులు సాధించేలా అవగాహన కలిగి ఉండాలన్నారు. విత్తన శుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలని సూచించారు. పంటను ఆశించే తెగుళ్లను విత్తనశుద్ధితో నివారించవచ్చన్నారు. వ్యవసాయ విధాన శాస్త్రవేత్త సోమశేఖర్ బాబు మాట్లాడుతూ..నానో యూరియా, డీఏపీ ఉపయోగించే విధానాలను వివరించారు. డాక్టర్.పీరూసాహెబ్ మాట్లాడుతూ.. వేరుశెనగ పంటను అడవిపందుల నుంచి రక్షించుకోవడానికి సోలార్ కంచెను వేసుకునే విధానంపై అవగాహన కల్పించారు. టమాటా పంట సాగులో సూదిపురుగు, ఆకుముడత తెగుళ్లను నివారించే పద్ధతులను రైతులకు తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు నరేంద్రరెడ్డి, వ్యవసాయ సహాయకులు రెడ్డిబాబు, రెడ్డికుమారి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్.జీఎస్.పాండురంగ

గోవు దానం

తంబళ్లపల్లె: ఉద్యోగ రీత్యా అమెరికాలో స్థిరపడిన ఎన్ఆర్ఐ దంపతులు బ్రాహ్మణునికి గోవు దానం చేసి దాతృత్వాన్ని చాటుకున్నారు. మండలంలోని వసంతగారిపల్లెకు చెందిన సిద్దాలింగారెడ్డి, గోపాలమ్మ దంపతుల కుమారుడు సిద్దేశ్వరరెడ్డి, జ్యోతి దంపతులు గురువారం తంబళ్లపల్లెకు చెందిన బ్రాహ్మణ వేదపండితులు స్కందమూర్తిశర్మకు రూ.25 విలువ చేసే ఆవును దానంగా ఇచ్చారు.

భక్తిశ్రద్ధలతో ఉరుసు

కడప కల్చరల్ : కడప నగరం వన్టౌన్ సర్కిల్ వద్దగల హజరత్ ఖ్వాజా సయ్యద్షా మహమ్మద్ షహబుద్దీన్ (మొహర్ అలీషా) దర్గా ఉరుసు గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఇందులో భాగంగా దర్గా పీఠాధిపతి హజరత్ సయ్యద్షా మహమ్మద్ జమాలుల్లాబాషా హుసేనీ సాహెబ్ తమ ఇంటి నుంచి గంధం కలశాన్ని ఫకీర్ల సాహస విన్యాసాలతో ఊరేగింపుగా దర్గాకు చేర్చారు. అనంతరం గురువుల మజార్పై పూలచాదర్, గంధం సమర్పించి ప్రార్థనలు చేశారు. ఫాతెహా నిర్వహించి హాజరైన భక్తులకు ప్రసాదాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

శ్రీశైలం దేవాంగ నిత్యాన్నదాన సత్రం కమిటీ డైరెక్టర్గా వుట్టి

ప్రొద్దుటూరు కల్చరల్ : పట్టణానికి చెందిన దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వుట్టి నాగశయనం శ్రీశైలంలోని శ్రీ ఉమారామలింగేశ్వర దేవాంగ నిత్య అన్నదాన సత్రం కమిటీ డైరెక్టర్గా నియమితులయ్యారు. తన నియామకానికి సహకరించిన సత్రం కమిటీ అధ్యక్షుడు బొమ్మన దుర్గాప్రసాద్రావు, కార్యదర్శి కాలేపు సత్యనారాయణమూర్తి, సహాయ కార్యదర్శి వుట్టి వీరయ్యలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఉమారామలింగేశ్వర దేవాంగ సత్రం అభివృద్ధికి తనవంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. వుట్టి నాగశయనం సత్రం కమిటీ డైరెక్టర్గా నియమితులవడం పట్ల పలువురు దేవాంగ ప్రముఖులు, కుల పెద్దలు అభినందనలు తెలిపారు.

పారదర్శకంగా బదిలీలు చేపట్టాలి

కడప రూరల్ : వైద్య ఆరోగ్యశాఖ జోన్–4 పరిధిలో చేపట్టే సాధారణ బదిలీలను పారదర్శకంగా చేపట్టాలని ఏపీ ఎన్జీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బి.శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై. ప్రసాద్ యాదవ్, జిల్లా కార్యదర్శి డి.రవికుమార్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆ శాఖ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ అనిల్మోహన్ను మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం వారు మాట్లాడుతూ జోన్–4 పరిధిలో చేపట్టే ఉద్యోగుల సాధారణ బదిలీలను నిబంధనల మేరకు చేపట్టి ఉద్యోగులకు మేలు చేకూరేలా చూడాలని కోరారు. జిల్లా సహాధ్యక్షులు తిమ్మారెడ్డి, కోశాధికారి నిత్య పూజయ్య, ఉపాధ్యక్షులు బాల పుల్లయ్య పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు పటిష్ట బందోబస్తు

రాజంపేట : ఈనెల 27 నుంచి జరిగే నందలూరు సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాలకు పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేస్తామని రాజంపేట డీఎస్పీ చైతన్య వెల్లడించారు. గురువారం నందలూరు మండలాధ్యక్షుడు మేడా విజయభాస్కర్రెడ్డి బ్రహ్మోత్సవాల నిర్వహణ నేపథ్యంలో డీఎస్పీని కలిసి భద్రతపరమైన సాయం అందించే విషయంపై చర్చించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో అవసరమైన రీతిలో సమీక్షించుకొని బందోబస్తును కల్పిస్తామన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా శాఖపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపీపీ విజయభాస్కర్రెడ్డి మాట్లాడుతూ ఈనెల 17న జరిగే బ్రహ్మోత్సవాల నిర్వహణ సమన్వయ సమావేశం నిర్వహించనున్నట్లు, సమావేశానికి పోలీసుశాఖ తరపున హాజరు కావాలని డీఎస్పీని కోరామన్నారు. బ్రహ్మోత్సవాల నిర్వహణకు శాఖపరంగా సహకారం అందిస్తామని డీఎస్పీ హామీ ఇవ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్ బోర్డు జిల్లా కార్యదర్శి సయ్యద్ అమీర్, మండల కో–ఆప్షన్ సభ్యుడు కలీం, వైఎస్సార్సీపీ నాయకుడు యల్లంరాచపల్లె సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అంతకముందుగా డీఎస్పీని ఎంపీపీ శాలువా కప్పి, బోకేను అందజేసి సత్కరించారు.

రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంతోనే ఆక్రమణలు

పీలేరు : రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంతోనే ఆయిల్స్ సీడ్ స్థలం ఆక్రమణలకు గురవుతోందని సీపీఐ జిల్లా కార్యదర్శి నరసింహులు అన్నారు. గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూనెవిత్తుల కర్మాగారం స్థలంలో అక్రమంగా నిర్మాణాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం సరికాదన్నారు. రెవెన్యూ అధికారులు స్పందించకుంటే ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున దీక్షలకు పూనుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు టి.ఎల్. వెంకటేష్, ఏఐటీయూసీ నాయకులు నరసింహులు, కోటేశ్వర్రావు, జక్కల వెంకటేష్, మదన్గోపాల్రెడ్డి, భాస్కర్రెడ్డి, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గుర్రంకొండలో అంగన్వాడీల ర్యాలీ

గుర్రంకొండ: మండల కేంద్రమైన గుర్రంకొండలో అంగన్వాడీ టీచర్లు, సిబ్బంది, పిల్లలు, పిల్లల తల్లిదండ్రులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. గురువారం వాల్మీకిపురం సీడీపీవో భారతి ఆధ్వర్యంలో ఈకార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రయివేట్ కాన్వెంట్లకు దీటుగా అంగన్వాడీ పాఠశాలలు అభివృద్ధి చెందాయన్నారు. వీటిలో అన్నిసౌకర్యాలు ఉన్నాయని పిల్లల తల్లిదండ్రులు తమ పిల్లల్ని ఇక్కడే చదవించాలన్నారు. ఇక్కడ ప్రీస్కూల్స్ మెటీరియల్తో పాటు పూర్వ ప్రాథమిక విద్య వర్క్బుక్స్కూడా పిల్లల చేత రాయిస్తారన్నారు. ఆటపాటలతో ఉల్లాసంగా ఇక్కడ చదవులు సాగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్లు రాణెమ్మ, మహాలక్ష్మీ పాల్గొన్నారు.

విద్యారంగానికి అధిక ప్రాధాన్యత

వాల్మీకిపురం: రాష్ట్రంలో ఉర్దూ భాషాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్ అన్నారు. గురువారం స్థానిక నాయక్వీధిలోని ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబంలో పిల్లల పట్ల తల్లిదండ్రులు ఏ విధంగా శ్రద్ధ తీసుకుంటారో అదే విధంగా సీఎం వైఎస్ జగన్ విద్యార్థుల విద్యాభివృద్ధి పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ విద్యారంగంలో అనేక సంస్కరణలు, విప్లవాన్ని తీసుకువచ్చారన్నారు. కార్యక్రమంలో రియాజ్ సాహెబ్, మహబూబ్బాషా, సాధిక్, షాహెద్, అమీర్ హుస్సేన్, మహమ్మద్ అలీ, జవహర్ పాల్గొన్నారు.

జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ

పీలేరు : జగనన్న విద్యాకానుకను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ డాక్టర్ హబీబ్బాషా అన్నారు. గురువారం పట్టణంలోని స్థానిక జెడ్పీ మెయిన్ ఉన్నత పాఠశాల, ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యకు రాష్ట్ర ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో కాలనీ చిన్న, మునీర్, నాగరాజ నాయక్, అబీద్, హెచ్ఎంలు సురేంద్రరెడ్డి, రహత్బాషా తదితరులు పాల్గొన్నారు.



వాల్మీకిపురం: విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను అందిస్తున్న అబ్దుల్ కలీమ్

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

కలికిరి: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతోందని గుట్టపాళెం సర్పంచ్ వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీ శ్రీకాంత్ అన్నారు. మండలంలోని గుట్టపాళెం కస్పాలోని ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం జగనన్న విద్యాదీవెన కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో సైతం పాఠశాలలు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఉన్నాయని, చదువుతో పాటు విద్యార్థులకు పౌష్టికాహారం అందిస్తుండటం గర్వకారణమన్నారు.

ఘనంగా గంగ జాతర

నిమ్మనపల్లె : మండలంలోని నిమ్మనపల్లె పంచాయతీ పెద్దమాదిగపల్లెలో గంగజాతర ఘనంగా నిర్వహించారు. మాతమ్మతల్లికి బుధవారం రాత్రి ప్రత్యేక పూజలు చేసి, ఊరేగింపు నిర్వహించారు. మహిళలు బోనాలతో ఆలయానికి వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు. గంగజాతర సందర్భంగా మాజీ ఎమ్మెల్యే డాక్టర్.దేశాయ్ తిప్పారెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలను అందించారు. అనంతరం గురువారం ఉట్లతిరుణాల కోలాహలంగా జరిగింది. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నవాజ్హుస్సేన్, వైఎస్సార్ సీపీ నాయకులు గెడ్డంనరసింహారెడ్డి, యర్రయ్య, ఈశ్వర, రాజన్న, రమణ తదితరులు పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

కలికిరి: మండలంలోని పారపట్ల గ్రామంలో శుక్రవారం పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్సీపీ మండల కన్వీనర్ చింతల రమేష్ కుమార్ రెడ్డి తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి జరిగే కార్యక్రమానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరవ్వాలని ఆయన కోరారు.

108లో ప్రసవం



ములకలచెరువు: పురిటి నొప్పులతో బాధపడుతున్న గర్భవతిని గురువారం తెల్లవారుజామున 108 వాహనంలో తరలిస్తుండగా ప్రసవం జరిగి పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. 108 సిబ్బంది శివకుమార్ కథనం మేరకు... మండలంలోని కోనేటివారిపల్లె పంచాయతీ ఏసువారిపల్లెకు చెందిన భవాని పురిటి నొప్పులతో ఉండగా కుటుంబ సభ్యులు 108 వాహనానికి సమాచారం అందించారు. 108 సహాయంతో మదనపల్లె జిల్లా హాస్పిటల్కు తరలిస్తుండగా బురకాయలకోట వద్దకు చేరుకోగానే నొప్పులు ఎక్కువకావడంతో 108 సిబ్బంది ప్రసవం చేయించారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నట్లు సిబ్బంది తెలిపారు.

సింగల్ విండో బ్యాంకు ద్వారా రుణాలు

తంబళ్లపల్లె: మండల కేంద్రంలోని నూతనంగా ఏర్పాటు చేసిన సింగల్ విండో బ్యాంకు ద్వారా రైతులకు బంగారు తాకట్టుపై రుణాలు ఇవ్వడం జరుగుతుందని సింగల్ విండో చైర్మన్ కె.భార్గవ్రెడ్డి, సీఈఓ భాస్కర్రెడ్డిలు తెలిపారు. శనివారం సింగల్ విండో బ్యాంకులో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభిస్తారన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు ఆదరణ

వాల్మీకిపురం: ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన మామిడి పండ్లు రకాలకు మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తున్నామని డీపీఎం యశోదమ్మ తెలిపారు. గురువారం మండలంలోని అయ్యవారిపల్లిలో చెంగల్ రాయులు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన మామిడి కాయలను మార్కెటింగ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో 5 మంది రైతులకు మార్కెటింగ్ చేయించామన్నారు.

నట్టల నివారణ మందు పంపిణీ

పెద్దమండ్యం: పశు సంవర్ధకశాఖ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న ప్రయోజనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వెటర్నరీ డాక్టర్ విక్రమ్రెడ్డి అన్నారు. మండలంలోని వెలిగల్లు గ్రామం కొత్తవాండ్లపల్లెలో గురువారం గొర్రెలు, మేకలకు ఉచితంగా నట్టల నివారణ మందు తాపించారు. డాక్టర్ విక్రమ్రెడ్డి మాట్లాడుతూ మండలంలోని 86 వేల గొర్రెలు, 18 వేల మేకలకు నట్టల నివారణ మందును పంపిణీ చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ చిట్టిమాని సరస్వతి, పశువైద్య సహాయకులు మహేష్, రైతులు పాల్గొన్నారు.

నేడు కురబలకోటకు ఎమ్మెల్యే రాక

కురబలకోట: తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి శుక్రవారం కురబలకోట జెడ్పీ హైస్కూల్లో జరిగే జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొంటారని జడ్పీటీసీ బైసాని జ్యోతి, ఎంపీపీ బి.దస్తగిరి, ఎంఈఓ ద్వారకనాథ్ తెలిపారు. నియోజకవర్గ స్థాయిలో జరిగే ఈ కార్యక్రమంలో పది, ఇంటర్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమానాలు అందజేస్తామని తెలిపారు.

నేరాల నియంత్రణకు చర్యలు తీసుకోండి

ములకలచెరువు: ములకలచెరువు సర్కిల్ పరిధిలోని మండలాల్లో నేరాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని సీఐ సాదిక్ అలీ అన్నారు. గురువారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఎస్ఐలతో నేరాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నాటుసారా, కోడిపందెం, పేకాట, కర్ణాటక మద్యం రవాణాను పూర్తిగా అరికట్టాలని సూచించారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలు, ఘర్షణలు జరగకుండా అదుపు చేయాలని ఆదేశించారు.

ఆలయానికి విరాళం

పీలేరురూరల్ : స్థానిక సాయిబాబా ఆలయానికి వైఎస్సార్సీపీ నాయకులు, అగ్రిఫైజర్ రాజేంద్రాచారి రూ. 10 వేలు విరాళం అందజేశారు. తమ కుమార్తె సుమలతకు అమెరికాలో ఉద్యోగం వచ్చిన శుభ సందర్భంగా గురువారం విరాళాన్ని ఆలయ నిర్వాహకులకు అందజేశారు.

పీలేరు కాంగ్రెస్ పార్టీ కో ఆర్డినేటర్గా షరీఫ్

కలకడ : పీలేరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కో ఆర్డినేటర్గా కలకడకు చెందిన మహమ్మద్ షరీఫ్ను ఎంపిక చేసినట్లు రాహుల్గాంధీ నుంచి నియామకపత్రం అందినట్లు తెలిపారు. రాష్ట్ర కార్యదర్శిగా , పీలేరు నియోజకవర్గ కో ఆర్డినేటర్గా బాధ్యతలు అప్పగించిన పార్టీ పెద్దలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

చీరెలు పంపిణీ



చీరెలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ శ్రీదేవి రవికుమార్

కలకడ : గ్రామ దేవత మాతమ్మ ఆశీస్సులు అందరిపై ఉండాలని ఎంపీపీ శ్రీదేవి, వైఎస్సార్ సీపీ నాయకులు రవికుమార్లు కోరుకున్నారు. మండలంలోని కె.బాటవారిపల్లె పంచాయతీ కె.మాదిగపల్లెలో గ్రామదేవత మాతమ్మ జాతర ఏడాది ఉత్సవాలలో భాగంగా గురువారం వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని మహిళలకు చీరెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాధ, వైఎస్సార్సీపీ నాయకులు నాగరాజ, మాతంగ, రవి, గోపాల్, ఆదినారాయణ, వెంకట్రమణ, నాగేష్ పాల్గొన్నారు.